క్లుప్తంగా

నేడు పెన్షనర్ల ధర్నా

రాజమండ్రి సిటీ: ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఉదయం 11 నుంచి శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్టు నగర పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు కేకే సంజీవరావు సోమవారం ఇక్కడ తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని యూనిట్ సభ్యులు, రాజమండ్రిలోని అన్ని ప్రభుత్వ శాఖల రిటైర్డ్ ఉద్యోగులు, క్లాస్–4, డ్రైవర్లు, ప్రభుత్వ రిటైర్డ్ కార్మిక సంఘాల సభ్యులు తరలిరావాలని కోరారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాస్



కడియం: కొత్త డిప్యూటీ ఎంపీడీవోగా ఎస్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అమలాపురం డివిజనల్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొందారు. కొద్ది రోజులుగా ఈ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇప్పటివరకు జేగురుపాడు కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాస్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

కొత్త నర్సరీలకు లైసెన్సులు


హెచ్‌వో లావణ్య

కడియం: మండలంలో కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేసుకునే రైతులు లైసెన్సులకు దరఖాస్తు చేసుకోవాలని మండల ఉద్యాన శాఖాధికారి పులిదిండి లావణ్య అన్నారు. అలాగే ఇప్పటికే లైసెన్స్‌లు ఉన్నవారు రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. జగ్గంపేట నుంచి బదిలీపై కడియం మండలానికి వచ్చిన హెచ్‌వో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సుధీర్‌కుమార్ కొవ్వూరుకు బదిలీ అయ్యారు. మూడేళ్ల కాల పరిమితితో లైసెన్సులు జారీ చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు పంచాయతీ కార్యాలయాల వద్ద ఉద్యాన సహాయకులను కానీ, 79950 86839 నంబర్‌లో కానీ సంప్రదించాలని కోరారు.

మహాలక్ష్మి పీఠం సందర్శించిన ఏఈఓ


రమణరాజును సత్కరిస్తున్న పీఠాధిపతి

సీటీఆర్ఐ (రాజమండ్రి సిటీ): గాడాలలో మహాలక్ష్మి సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠాన్ని ద్వారకా తిరుమల ఏఈఓగా పదోన్నతి పొందిన అయినంపూడి రమణరాజు సోమవారం సందర్శించారు. అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాలక్ష్మి, వారాహి అమ్మవార్లకు పూజలు చేశారు. ఆయనకు పీఠాధిపతి చిన్న వేంకన్నబాబు ఆశీస్సులు అందించారు. దుశ్శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సమాజంలో సేవాభావం కలిగి ఉండటమే నిజమైన భక్తిమార్గంగా పీఠాధిపతి సూచించారు. కార్యక్రమంలో మన గుడి– మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్మన్ దుర్గావెంకట హేమావతి, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు, అయినంపూడి సాయి పాల్గొన్నారు.

‘భోజనం’ మెనూలో మార్పు


దివ్యాంగ విద్యార్థిని అభినందిస్తున్న దిలీప్‌కుమార్

రాజమండ్రి సిటీ: తల్లిదండ్రుల నుంచి వచ్చిన సూచనల మేరకు మధ్యాహ్న భోజన పథకం మెనూలో మార్పులు చేసి అమలు చేస్తున్నామని అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక బైపాస్ రోడ్‌లోని దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. దివ్యాంగ విద్యార్థి అబుకిజర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మధ్యాహ్న భోజనం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కరాటే మాస్టర్ శ్రీను మృతి

ధవళేశ్వరం: ప్రముఖ కరాటే మాస్టర్ పిట్టల శ్రీను(58) సోమవారం స్థానిక ఇండస్ట్రియల్ కాలనీలోని స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన అంతర్జాతీయ కరాటే పోటీల్లో బ్లాక్ బెల్ట్ ఫిఫ్త్ డాన్ పట్టా అందుకున్నారు. ఆయన మృతికి రాష్ట్ర స్థాయి కరాటే, కుంగ్‌ఫూ ఫైటర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు సంతాపం తెలిపారు.

పాతుకుపోతే ఎట్లా..!

- రోడ్లపైనే లోడింగ్, అన్ లోడింగ్
- వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ప్రయాణికుల అవస్థలూ బేఖాతరు
- నర్సరీల వద్ద నెలకొన్న తీవ్ర సమస్య


రోడ్డుపై నిలిపిన వాహనంలో మొక్కలు లోడింగ్ చేస్తున్న క్రేన్

కడియం: సుదూర ప్రాంతాల్లోను ప్రసిద్ధి చెందిన నర్సరీలు కడియం మండలంతో పాటు, చుట్టుపక్కల ఏడెనిమిది మండలాలకు ఎంతో కీలకం. ఆయా మండలాల్లోని ప్రజలకు ఉపాధి అవకాశాలను విస్తృతంగా కల్పిస్తున్నాయనడంలో సందేహం లేదు. ఏటా సీజన్‌లో రోడ్లపైనే భారీ వాహనాలను నిలిపి ఉంచి మొక్కలను లోడింగ్ చేస్తుండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ రహదారి మొదలు చిన్నపాటి ట్రంక్ రోడ్ల వరకు ఇదే పరిస్థితి ఉండడంతో.. మండలంలో ఏ రోడ్డుకు వెళ్లినా ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడం సర్వసాధారణం. ఉద్దేశపూర్వకంగా రోడ్డుపైనే వాహనాన్ని నిలిపి మొక్కలు లోడింగ్ అయ్యేంత వరకు ఉంచడంతో ఆ మార్గంలో ప్రయాణిస్తున్న వాహనాలు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి.

ఎగుమతుల సీజన్

ప్రస్తుతం మొక్కల ఎగుమతుల సీజన్ కావడంతో నిత్యం 200 నుంచి 300 వివిధ రకాల వాహనాల్లో మొక్కల లోడింగ్ జరుగుతుంది. మొక్కల ఎగుమతులు, దిగుమతులకు అనుగుణంగా తమ నర్సరీల్లో పార్కింగ్ సదుపాయం అతి తక్కువ నర్సరీల్లో మాత్రమే ఉంది. ప్రధాన రోడ్లను ఆనుకుని ఉన్న నర్సరీల్లో అత్యధిక శాతం మొక్కల ఎగుమతులు, దిగుమతులు రోడ్లపైనే వాహనాన్ని ఉంచి జరుగుతున్నాయని ప్రజలు చెబుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు

వాహనాలను రోడ్డుపైనే పెట్టి మొక్కలు ఎగుమతి, దిగుమతి చేయడంతో పాటు, నర్సరీల్లో వినియోగించే మట్టి గుట్టలను సైతం రోడ్డును ఆనుకుని వేయడం వల్ల గతంలో మండలంలోని పలుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాహనదారులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో పాటు, నర్సరీ సంఘం కూడా రైతులను చైతన్యపరిచి, రోడ్లపై ప్రయాణించే వారికి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసేందుకు ప్రయత్నించింది. ఈ ప్రయత్నం మధ్యలోనే విడిచిపెట్టేయడంతో ఇప్పుడు ఎప్పటిలాగే రోడ్ల వెంబడి వాహనాల పార్కింగ్ కొనసాగుతోంది.


హైవే వెంబడి నిలిపి ఉంచిన వాహనాలు


కడియపులంక వద్ద వాహనాల రద్దీ కారణంగా ట్రాఫిక్ ఇబ్బందులు

ట్రాఫిక్‌కు ఆటంకం

ముఖ్యంగా భారీ వృక్షాలను లారీల్లోకి ఎక్కించేందుకు క్రేన్లను సైతం వినియోగిస్తుంటారు. ఒక్కో మొక్కను నర్సరీ నుంచి బయటకు తెచ్చి, లారీలోకి ఎక్కించేందుకు అరగంటకు పైగా సమయం పడుతుంది. లారీతో పాటు, క్రేన్‌ను కూడా రోడ్డుపైనే ఉంచి ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అప్పటి వరకు ఈ రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముఖ్యంగా దుళ్ల–మడికి రోడ్డు, కడియం–దుళ్ల రోడ్డు, కడియం–బుర్రిలంక రోడ్లలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్లలో మొక్కలను లోడింగ్ చేసేందుకు రోడ్డుపైనే లారీలను ఉంచి క్రేన్ల సాయంతో మొక్కలను ఎగుమతి చేస్తున్నారు. ఆ సమయంలో రోడ్డుపై ప్రయాణించే అన్ని వాహనాలు నిలిచిపోతున్నాయి.

లారీల పార్కింగ్

జాతీయ రహదారిపై కడియపులంక వద్ద లారీ సప్లై కార్యాలయాల వద్ద కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది లారీలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ ప్రదేశంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి. అయినప్పటికీ వాహనాలను నిర్లక్ష్యంగా పార్కింగ్ చేస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొక్కలను ఎగుమతి, దిగుమతి చేసుకునేందుకు రోడ్లపై వాహనాలను నిలిపి ఉంచకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా సింగిల్ రోడ్లలో తగిన పార్కింగ్ స్థలాన్ని నర్సరీల వద్ద ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపైనే పెడుతున్నారు

సీజన్‌లో మొక్కల ఎగుమతులు, దిగుమతులు సాధారణం. అందుకు వచ్చే వాహనాలను ప్రధాన రోడ్డుపైనే పెడుతున్నారు. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతోంది. కనీసం ట్రాఫిక్‌ను క్లియర్ చేసే ప్రయత్నం కూడా చేయడం లేదు. దీంతో వీరవరం నుంచి కడియం వరకు రావడానికి ముప్పావు గంటకు పైగా సమయం పట్టింది.

– వీరబాబు, ప్రయాణికుడు

సర్వీస్ రోడ్డు అత్యవసరం

కడియపులంక వద్ద ఉదయం, సాయంత్రం వేళల్లో హైవే పక్కనే పెద్ద సంఖ్యలో లారీలు పార్కింగ్ చేస్తున్నారు. వీటి కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇక్కడ సర్వీస్ రోడ్డు ప్రతిపాదనగానే మిగిలిపోయింది. కనీసం సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు తగ్గుతాయి.

– మణికంఠ, ప్రయాణికులు

డాక్టర్ భారతికి ‘శలాక’ పురస్కారం



సీటీఆర్ఐ (రాజమండ్రి సిటీ): శలాక రఘునాథ శర్మ విద్వత్ సమర్చన పురస్కారానికి హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి ఎంపికయ్యారు. పదేళ్లుగా రాజమండ్రికి చెందిన శలాక రఘునాథ శర్మ జన్మదినం సందర్భంగా భాషా సాహిత్యాలకు సేవ చేసిన ప్రముఖులకు ఈ పురస్కారాలను అందజేస్తున్నారు. ఆపాత మధురం, మాతృదేవోభవ తదితర రచనలతో పాటు, ముక్తేవి భారతి వివిధ పత్రికల్లో వ్యాసరచనలు రచించారు. ఈ నెల 17న హైదరాబాద్‌లోని ముక్తేవి భారతి ఇంటి వద్ద పురస్కారాన్ని అందజేస్తారు. ఐఏఎస్ అధికారులు ఎల్వీ సుబ్రహ్మణ్యం, వేంకటరామిరెడ్డి, సాహితీవేత్త డాక్టర్ ఏల్చూరి మురళీధరరావు తదితరులు పాల్గొనున్నారు. రూ.35 వేల నగదు, నూతన వస్త్రాలతో భారతిని సత్కరించనున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు, రేపు అంతరాయం

రాజమండ్రి సిటీ: వివిధ మరమ్మతుల కోసం నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళ, బుధ వారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొంతమూరు, కాతేరు, కోలమూరుల్లోని పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 12.30 వరకు దానవాయిపేట, టీటీడీ కల్యాణ మండపం రోడ్, గాంధీ పార్క్, గుంటూరు మెస్, ఆనంద్ రీజెన్సీ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు. బుధవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నగరంలోని రంగ్రీజుపేట, చందా సత్రం, గుండు వారి వీధి, సదనం పాఠశాల, నూనెకొట్ల సందు, శంకర మఠం, వంకాయల వారి వీధి, గోదావరి గట్టు తదితర ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ వివరించారు.

ఏఐ ఆధారిత కోర్సులతో అవకాశాలు


ఏఐ కోర్సుల్లో చేరిన విద్యార్థులతో అధ్యాపకురాలు

రాజమహేంద్రవరం సిటీ: కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా ఎంబీఏ కాలేజీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులు ప్రారంభించినట్లు నిర్వాహకులు, లెక్చరర్లు కె.ఝాన్సీ, ఎం.విశాలాక్షి సోమవారం తెలిపారు. ప్రొఫెషనల్ మేనేజ్‌మెంట్ విద్యతో పాటు టెక్నాలజీ రంగంలో మహిళలు ప్రగతి సాధించేందుకు గాను ఎంబీఏ చదువుతున్న విద్యార్థినులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించామన్నారు. ప్రస్తుత రోజుల్లో ఏ రంగంలోనైనా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పరిజ్ఞానం చాలా అవసరమన్నారు. ఈ కోర్సుల ద్వారా విద్యార్థులకు అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. ఏఐ శిక్షణ ద్వారా మేనేజ్‌మెంట్ విద్యార్థినులు బిజినెస్ కంటెంట్ క్రియేషన్, డిజిటల్ మార్కెటింగ్, బిజినెస్ ఆటోమేషన్, టాలీ, అకౌంటింగ్ వంటి రంగాల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చన్నారు.

విభజన హామీలపై న్యూఢిల్లీలో ధర్నా


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజమండ్రి సిటీ: ఏపీ విభజన జరిగి 11 ఏళ్లు దాటినా రాష్ట్రానికి రావాల్సిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా పూర్తి చేయలేదని డీవైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) జిల్లా కన్వీనర్ రాంబాబు అన్నారు. హామీల అమలుకు డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జూలై 18న న్యూఢిల్లీలో చేసే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక శ్యామల సెంటర్‌లో ప్రజా సంఘాల కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా కమిటీ సభ్యులు టి.రాజేష్, సభ్యులు రామకృష్ణ, నిశ్చల్, ప్రసాదు, రమేష్ పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల ట్రాక్టర్ బోల్తా


క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

దేవరపల్లి: దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో బేళ్లు దింపిన ట్రాక్టర్ తిరిగి రామన్నపాలెం వెళ్తుండగా మార్గమధ్యలో సోమవారం రాత్రి అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న బి.నాగరాజు, కిషోర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌కి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

ప్రజలంతా జగనన్న పక్షమే..


శివను అభినందిస్తున్న డాక్టర్ గూడూరి


శివకుమార్, సుబ్బారావును సత్కరిస్తున్న జక్కంపూడి రాజా

వైఎస్సార్ సీపీ రాజమండ్రి పార్లమెంటరీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి

రాజమహేంద్రవరం సిటీ: ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ప్రజలంతా విసుగెత్తిపోయారని, వారంతా జగనన్న పక్షానే ఉన్నారని, రానున్నది తమ పార్టీ ప్రభుత్వమేనని వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దాసరి శివ ను డాక్టర్ శ్రీనివాస్ శాలువా కప్పి, అభినందనలు తెలిపారు. సీనియర్ నాయకులు బొప్పన సుబ్బారావు, దాసరి శివ ఆధ్వర్యంలో పలువురు రూరల్ నియోజకవర్గ నాయకులు దివాన్ చెరువు గ్రామంలోని విజయ భారతి ఇన్‌స్టిట్యూట్ ప్రాంగణంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, పార్టీని బలోపేతం చేయడంతో పాటు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మీరావలి, బాషా, అనిల్, ఇసుకపల్లి శంకర్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: జక్కంపూడి

రాజమండ్రి రూరల్: వైఎస్సార్ సీపీలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దాసరి శివకుమార్ జక్కంపూడి రాజాను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. శివకుమార్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావును జక్కంపూడి రాజా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చీరా రాజు, సుందరపల్లి అనిల్, శిరసపల్లి శంకరరావు, షేక్ ఇబ్రహీం, కామిరెడ్డి పెదకాపు, షేక్ మీరావలి తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్లాస్టిక్ నిషేధం కఠినం

- కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి
- నగరంలో ఆకస్మిక తనిఖీలు


పూల మార్కెట్‌లో తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

రాజమండ్రి సిటీ: ప్లాస్టిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు కలెక్టర్, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం స్థానిక జాంపేటలోని పూలు, చేపల మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు పాటించని పలు దుకాణాలకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నగరంలో ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. పర్యావరణానికి హానికరమైన 20 రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను ప్రభుత్వం నిషేధించిందన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ కవర్లను పూర్తి స్థాయిలో నిలిపివేయాలని, అవి పర్యావరణానికి హాని కలిగించడంతో పాటు, భూమిలో కలవటానికి కొన్ని ఏళ్లు పడుతుందన్నారు. దీనిని నివారించాలంటే ప్లాస్టిక్ వాడకం, కొనటం, అమ్మకం నిషేధం పూర్తి స్థాయిలో జరగాలన్నారు. ప్రజలందరూ జ్యూట్ బ్యాగులు, కాగితపు సంచులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్‌ను వినియోగించడం ద్వారా జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో పడేయడం వల్ల మురుగు పారుదలకు అడ్డుపడి, వర్షాల సమయంలో డ్రైనేజీలు పొంగే పరిస్థితులు తలెత్తుతాయన్నారు. వ్యాపారులు, వినియోగదారులు సహకరించి నగర పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ వెంట ఎంహెచ్‌ఓ ఎ.వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కోరం లేకుండా పంచాయతీ సమావేశం!

ఎంపీడీవోకు వార్డు సభ్యుల ఫిర్యాదు


ఎంపీడీవో రమేష్‌కు ఫిర్యాదు చేస్తున్న వార్డు సభ్యులు

కడియం: సభ్యుల కోరం లేకుండా పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించినట్లు కడియపులంక పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి సర్పంచ్‌లు రికార్డులు సృష్టిస్తున్నారని గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు సోమవారం ఎంపీడీవో కె.రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి సర్పంచ్‌గా వ్యవహరిస్తున్న వ్యక్తికి అనుకూలమైన తీర్మానాలను మాత్రమే ధ్రువీకరిస్తున్నారన్నారు. రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతోందని, దీని కారణంగా పంచాయతీ సమగ్రాభివృద్ధి కుంటుపడుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. జనరల్ ఫండ్ రూపంలో వసూలు చేసే డబ్బు ప్రతి రోజు ఎంత వసూలవుతోంది, ట్రెజరీకి ఎప్పుడు కడుతున్నారు, అప్పటి వరకు ఆ సొమ్ము ఎవరు వినియోగించుకుంటున్నారన్నది కూడా అధికారులు తేల్చాలన్నారు. కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్లకు వాటరింగ్ చేయడం, పీచు వేయడం, కటింగ్‌లు పెట్టడం, తారు వేయడం వంటివి జరగడం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏ పనికి ఎంత ఖర్చుచేశారన్నది కూడా సభ్యులకు తెలియజేయడం లేదని వివరించారు. దీనిపై విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బోడపాటి మూర్తి, ఎ.శ్రీను, బొర్సు సుబ్రహ్మణ్యం, సోడసాని దుర్గారావు, మార్గాని ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు కోసం ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సంఘ సభ్యులు

సీటీఆర్ఐ (రాజమండ్రి సిటీ): ప్రభుత్వ భూమికి జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్‌ని రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండవ దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల ద్వారా పేదలను ఇబ్బంది పెడుతున్న కేసులో ప్రభుత్వం ఇంప్లీడ్ పిటీషన్ వేసి న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ చిన్నరాముడుకు వినతిపత్రం అందజేశారు. గోకవరం మండలం గంగంపాలెంలో పేదలు సాగు చేసుకుంటున్న ప్రభుత్వ ఎల్సీసీ భూమి 1993 నుంచి ఇప్పటి వరకు సుమారు 37 కుటుంబాల వారు సాగు చేసుకుంటున్నారన్నారు. ఈ భూములకు పట్టాలు ఇవ్వాలని ఆందోళన చేసి హైకోర్టును ఆశ్రయించామన్నారు. వారందరికీ ప్రభుత్వం పట్టాలను కూడా మంజూరు చేసిందన్నారు. కొందరు అధికారులు పేదలకిచ్చిన భూములను జిరాయితీ భూములుగా చూపించి, ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేశారన్నారు. ధర్నా కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్లు

రాజమహేంద్రవరం సిటీ: ప్రభుత్వ అటానమస్ కళాశాలకు చెందిన పలువురు అధ్యాపకులు డాక్టరేట్‌లు పొందినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే సోమవారం తెలిపారు. రసాయన శాస్త్ర అధ్యాపకురాలు మంచిరాజు పద్మజ, భౌతిక శాస్త్ర విభాగాధిపతి చిన్నం కోమల లక్ష్మి డాక్టరేట్ పొందినట్లు చెప్పారు. ఔషధ గుణాలు సమృద్ధిగా ఉన్న అకేసియా కేసియా మొక్క నుంచి హరిత నానో సంశ్లేషణ చేసిన లోహ ఆక్సైడ్ల యాంటీ ఆక్సిడెంట్, శిలీంధ్ర నిరోధకత, యాంటీ క్యాన్సర్ జీవసంబంధ ధర్మాలు అనే అంశంపై మంచిరాజు పద్మజ పరిశోధన చేశారన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. గీతం యూనివర్సిటీలో ఫిజిక్స్ విభాగంలో పరిశోధనలు జరిపి చిన్నం కోమల లక్ష్మి పీహెచ్‌డీ పొందినట్లు చెప్పారు. ధన అయాన్లు ప్రతిక్షేపించిన బిస్మత్ ఫెర్రైట్ల అయస్కాంత, అనయస్కాంత ధర్మాలు అనే అంశంపై పరిశోధనలు జరిపారన్నారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన అభినందన సభలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామమూర్తి, సహాయ ప్రిన్సిపాల్ జి.చంద్రశేఖర్, అకడమిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఆకెళ్ల రాజేశ్వరి, భౌతికశాస్త్ర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో సమయం వృథా కాదు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి


కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: వివిధ కేసుల్లో మధ్యవర్తిత్వం చేయడం ద్వారా సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం చేకూరుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి అన్నారు. సోమవారం సంస్థ సమావేశ మందిరంలో మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమంలో భాగంగా వివిధ చిట్‌ఫండ్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులతో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ, దీనివల్ల సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న ఆయా సంస్థల సివిల్, కాంపౌండబుల్ క్రిమినల్, రాజీ పడదగిన ఇతర కేసులను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పి.శ్రీనివాస్, జీకే కపూర్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమి కౌలుకు వేలం

పెదపూడి: దోమాడలో వేణుగోపాలస్వామి ఆలయ భూమికి సంబంధించిన కౌలు వేలం పాట సోమవారం పూర్తయిందని ఆలయ ఈఓ వడ్డాది సత్యనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ, ఆలయానికి సంబంధించి 18.03 ఎకరాల సాగు భూమి ఉందన్నారు. ఈ భూమికి వేలం పాట నిర్వహించగా, ఈ ఏడాది రూ.3.5 లక్షలకు ఓ రైతు దక్కించుకున్నాడు. గతేడాది జూన్ 11న ఈ భూమికి కౌలు వేలం పాట నిర్వహించగా, అప్పుడు రూ.2.6 లక్షలకు అదే గ్రామానికి చెందిన రైతు సొంతం చేసుకున్నారు. అప్పుడు తక్కువ సొమ్ముకు పాట వెళ్లడంతో రద్దు చేసి, మళ్లీ వేలం పాట నిర్వహించారు. ఈసారి వేలం పాట ఎక్కువకు వెళ్లగా, ఏడాదికి రూ.90 వేల ఆదాయం పెరిగిందని ఈఓ తెలిపారు.

ఓహెచ్‌ఆర్‌ల నిర్వహణ గాలికి..


బిక్కవోలులో నాచు పట్టి ఉన్న వాటర్ ట్యాంకు

బిక్కవోలు: తాగునీటి ట్యాంకుల(ఓహెచ్‌ఆర్) నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మండల కేంద్రమైన బిక్కవోలు గ్రామం.. అందునా తహసీల్దార్ కార్యాలయం చెంతనే ఉన్న పంచాయతీ నిర్వహణలోని తాగునీటి ట్యాంకు నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. ట్యాంకు నాచు పట్టి ఉండగా, పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. కనీసం ట్యాంకు నిర్వహణ బోర్డుపై క్లీనింగ్ తేదీని కానీ, తదుపరి శుభ్రపర్చాల్సిన తేదీ కానీ లేవు. ట్యాంకు నిర్వహణ ఎలా ఉందో దీనినిబట్టే అవగతమవుతోంది. ఈ ట్యాంకు పరిధిలో సుమారు 1,200 కుళాయిలు ఉన్నాయంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వాటర్ ట్యాంకుల పరిశుభ్రతపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.